
ఈనాడు
జగిత్యాల
శుక్రవారం అక్టోబరు 11, 2024


రాయికల్ బస్టాండ్ ఆవరణలో..

రామ రామ రామ ఉయ్యాలో..


జగిత్యాలలో..

ఒక్కేసి పువ్వేసి చందమామ.. ఒక్క జామాయే చందమామ.. రామ రామ రామ ఉయ్యాలో రాముడే శ్రీరామ ఉయ్యాలో.. అంటూ ఆడబిడ్డలు, మహిళలు గౌరమ్మను ఘనంగా సాగనంపారు. సద్దుల బతుకమ్మ వేడుకలు జిల్లాలో గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. నవరాత్రులూ ఆరాధించిన బతుకమ్మను గునుగు, తంగేడు, బంతి, చామంతి విభిన్నరకాల పూలతో అందంగా తీర్చిదిద్దారు. జగిత్యాల పట్టణంలోని అన్ని కూడళ్లలో ఒక్కచోట చేర్చిన బతుకమ్మల వద్ద మహిళలు, యువతులు చేరి పాటలు, కోలాటాలతో ఆటలాడారు. అనంతరం బతుకమ్మలతో శోభాయాత్ర నిర్వహించారు. చింతకుంట చెరువు, గోవిందుపల్లి, మోతెవాగు, రామాలయం కెనాల్, మోతె చెరువు, కండ్లపల్లి చెరువు తదితర ప్రాంతాల్లో నిమజ్జనం చేశారు. పురపాలికల ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పోలీసులు పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు. - న్యూస్‌టుడే, జగిత్యాల పట్టణం


జగిత్యాలలో యువతి


కోరుట్లలో భారీ బతుకమ్మ


జగిత్యాల: పోచమ్మవాడలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


జగిత్యాల కండ్లపల్లి చెరువులో బతుకమ్మ నిమజ్జనం


జగిత్యాల: హనుమాన్‌వాడలో నిమజ్జనానికి తరలిస్తున్న బతుకమ్మలు


వెల్గటూరు: బాలగణేష్ యూత్ ఆధ్వర్యంలో...

ఉపాధ్యాయులు రిపోర్ట్ చేయాలి

జగిత్యాల, న్యూస్‌టుడే: డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులుగా ఎంపికై హైదరాబాద్‌లో సీఎం సభలో ఉత్తర్వులు పొందిన అన్ని కేటగిరీల వారు శుక్రవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ బి.జగన్‌మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 మధ్యల రిపోర్ట్ చేయాలని ఆయన పేర్కొన్నారు.

పట్టణ సమస్యలు పట్టవా?

నిధులు లేక నిలిచిన పనులు

న్యూస్‌టుడే, ధర్మపురి

పట్టణంలో ఎక్కడికక్కడే సమస్యలు నెలకొన్నాయి. ఇప్పటికే ప్రారంభమైన పనులు పూర్తయ్యేలా చూడటం, మరోవైపు తుది దశలో ఉన్న వాటికి నిధులు విడుదల చేయాల్సిన అవసరముంది. ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేకంగా ధర్మపురి పట్టణ సమస్యలపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. వీటిపై ప్రత్యేక కథనం...


ఆలయానికి పార్కింగు స్థలం లేక రోడ్డు పక్కనే నిలిపిన వాహనాలు

డంపింగుయార్డు లేక సమస్యలు

పట్టణంలో నిత్యం 7 స్వచ్ఛ వాహనాల ద్వారా తడి, పొడి చెత్తను సేకరిస్తున్నారు. డంపింగ్ యార్డు లేకపోవడంతో చెత్తను శ్మశాన వాటిక సమీపంలో గుట్టలుగా పడేస్తున్నారు. డంపింగుయార్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసినప్పటికీ స్థలం లేక సమస్యలు ఎదురవుతున్నాయి. అధికారులు గతంలో ఒకటి రెండు చోట్ల స్థలాన్ని పరిశీలించినా.. సమీప ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో నిలిచిపోయింది.

రోడ్డు పక్కనే పార్కింగు

పట్టణంలోని ఆలయానికి ప్రత్యేకంగా పార్కింగ్ స్థలం లేక దేవస్థానం ఎదుట పెద్దఎత్తున వాహనాలు నిలిపివేస్తున్నారు. దీంతో అటు వాహనదారులకు, ఇటు స్థానికులకు సమస్యలు ఎదురవుతున్నాయి. కనీసం గోదావరి తీరంలో ప్రైవేటు వ్యక్తుల వద్ద నుంచి స్థలాన్ని సేకరించి, వాహనాల పార్కింగుకు స్థలాన్ని కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు.


డంపింగుయార్డు లేక శ్మశానవాటిక పక్కనే పేరుకుపోయిన చెత్త

సమీకృతం.. ఫలితం శూన్యం

పట్టణంలో రూ.8 కోట్ల వ్యయంతో సమీకృత మార్కెట్‌ను నిర్మించారు. శాఖాహార, మాంసాహార విభాగాలకు ప్రత్యేకంగా నాలుగు షెడ్లను ఏర్పాటుచేశారు. అయితే షెడ్ల లోపల ఏర్పాటు చేసిన గద్దెలు తమకు అనుకూలంగా లేవని మార్కెట్‌యార్డు ముందే కూరగాయలను విక్రయిస్తున్నారు. దీంతో ప్రజాధనం వృథా అవుతోంది.

అధ్వానంగా రహదారులు

పట్టణ ప్రగతి, ప్రత్యేక అభివృద్ధి నిధుల ద్వారా రూ.కోట్లాది నిధులతో చేపట్టిన రహదారుల నిర్మాణాలు నిలిచిపోయాయి. గతంలో వివిధ రోడ్ల నిర్మాణాలను ప్రారంభించి వదిలేయడంతో పాటు. నూతన రహదారుల నిర్మాణాలు ప్రారంభదశలోనే మిగిలిపోయాయి. గాంధీ, పటేల్, వివేకానంద ఇతర కూడళ్లతోపాటు పలు వార్డుల్లో అంతర్గత రహదారులు అధ్వాన్నంగా మారాయి. స్వామివారి సేవ తిరిగే రోడ్లయితే మరీ అధ్వానంగా మారాయి.

స్థాయి పెంచినా సేవలు అంతంతే

పట్టణంలో సామాజిక ఆసుపత్రిని 50 పడకలుగా స్థాయి పెంచారు. నిత్యం 150 మంది వరకు ఓపీకి వస్తున్నా.. సేవలందించడంలో వైద్యులు వెనకబడి ఉన్నారు. మొత్తం 23 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా.. సగం వరకు పోస్టులు భర్తీ అయ్యాయి. అందులోనూ 3 గంటల తర్వాత ఒకరు మాత్రమే అందుబాటులో ఉంటున్నారనే ఫిర్యాదులున్నాయి. ఎక్స్‌రే, స్కానింగ్ యంత్రాలు లేవు. ఆసుపత్రిలో 10 పడకల ఐసీయూ కేంద్రాన్ని మంజూరు చేసినా.. పరికరాలు రాక నిలిచిపోయింది.

దేవస్థానంలో ఆధ్యాత్మిక సేవలేవీ?

పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ప్రగతి అంతంతే ఉంటోంది. ఏటా రూ.10 కోట్ల నికర ఆదాయం కలిగిన ఈ ఆలయాన్ని దర్శించడానికి రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. అభివృద్ధి నిధులు విడుదల అయినా.. పనులు ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఇష్టారాజ్యంగా నిధులు వెచ్చించడం, తిరిగి ఉత్సవాల సమయంలో దాతల సహకారంతోనే నిర్వహించడం జరుగుతోంది.

సింహ వాహనంపై శ్రీవారి దర్శనం



కోరుట్ల పట్టణంలో శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం రాత్రి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో సింహ వాహనంపై శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం పుర వీధుల్లో స్వామివారి శోభయాత్ర చేపట్టగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. - న్యూస్‌టుడే, కోరుట్ల

అన్నపూర్ణ దేవిగా... మహాగౌరి అవతారం



దుర్గా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదోరోజు గురువారం అన్నపూర్ణదేవి, మహాగౌరి రూపంలో భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. నవదుర్గా క్షేత్రపీఠంలో అన్నపూర్ణ దేవిగా అలంకరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కనదుర్గా సేవాసమితి ఆధ్వర్యంలో సిద్ధిదాత్రి రూపంలో అలంకరించారు. అనంతరం చండీహవనం, సప్త హారతులు అమ్మవారికి సమర్పించారు. - న్యూస్‌టుడే, జగిత్యాల విద్యానగర్

ఆరోగ్యానికి అండా



- రోజుకొకటి తింటే మేలు
- నేడు ప్రపంచ గుడ్డు దినోత్సవం

ఈనాడు, కరీంనగర్

ఉమ్మడి జిల్లాలో రోజుకు

గుడ్ల ఉత్పత్తి	వినియోగం	జాతీయ పోషకాహార మండలి సిఫార్సు ప్రకారం ప్రతి మనిషి సగటున ఏడాదికి తినాల్సిన గుడ్లు
50 లక్షలు	12 లక్షలు	180

గుడ్డు.. ఆరోగ్యానికి అండగా నిలుస్తోంది. శరీరానికి సరిపడే సమతులాహారంగా మారుతోంది. అవసరమైన పోషకాలు అందిస్తూ రోగనిరోధక శక్తి పెరగడానికి దోహదపడుతుంది. నేడు ప్రపంచ గుడ్డు దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో వినియోగంపై కథనం..

ఒక గుడ్డులో..

- కేలరీలు- 80
- ప్రొటీన్లు- 6.30 గ్రాములు
- కార్బోహైడ్రేట్లు- 0.6 "
- మొత్తం కొవ్వు- 5 "
- కొలెస్ట్రాల్- 213 మిల్లీ గ్రాములు
- సోడియం- 63 "

ఇవి గమనించండి

- పౌల్ట్రీఫామ్‌లోని ఒక కోడి సంవత్సరానికి 305-310 గుడ్లను పెడుతుంది.
- కోడి జీవితకాలంలో 75-80 వారాలపాటు గుడ్లు పెట్టగలదు. హైబ్రిడ్‌వి 100 వారాలు పెడతాయి.
- నాటు కోడి మాత్రం ఏడాదికి 150-200 గుడ్లను మాత్రమే అందివ్వగలదు.
- రోజు రెండుకన్నా ఎక్కువ గుడ్లు తినేవారు కచ్చితంగా వ్యాయామం చేస్తే మంచిది.
- మోతాదుకు మించి తింటే జీర్ణాశయంపై ప్రభావం చూపి కడుపులో చికాకు కలిగిస్తుంది.
- లేయర్ కోడి గుడ్డు పరిమాణం 70-100 గ్రాములు, దేశవాళీ అయితే 30-60 గ్రాములుంటుంది.

బడుల్లో.. అంగన్‌వాడీ కేంద్రాల్లో..

- నాలుగు జిల్లాల పరిధిలో 1-10వ తరగతి చదివే ప్రభుత్వ విద్యాలయాల్లోని విద్యార్థులు దాదాపుగా 2 లక్షల మందికి వారానికి మూడుసార్లు ఈ కోడిగుడ్డు పౌష్టికాహారంగా అందివ్వాలి. అయితే మధ్యాహ్న భోజనానికి చెల్లిస్తున్న డబ్బులు సరిపోవడం లేదని కొన్నిచోట్ల నిర్వాహకులు వారానికోసారే ఇస్తున్నారు.
- అంగన్‌వాడీ కేంద్రాల్లో 1.80 లక్షల అంగన్‌వాడీ చిన్నారులతోపాటు గర్భిణులు, బాలింతలకు కూడా గుడ్లు ఇస్తారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసేవి పరిమాణం తక్కువగా ఉంటున్నాయనే ఆరోపణలుంటున్నాయి.

కొవ్వు పెరుగుతుందనుకోవడం అపోహనే..



గుడ్డులో పచ్చసొనతో కొవ్వు పెరుగుతుందనేది అపోహ మాత్రమే. అందులో డీ3 విటమిన్ ఉంటుంది. ఇది శరీరంలోని ఎముకల గట్టిదనానికి చాలా అవసరం. గుండె రక్తనాళాల్లో బ్లాక్‌లు ఏర్పడకుండా నివారించే లెసిపెన్ అనే రసాయనం పచ్చసొనలో ఉంటుంది. చాలా మందిలో ఇటీవల రక్తంలో హిమోగ్లోబిన్ శాతం తగ్గడం వల్ల అనారోగ్యానికి గురవుతున్నారు. పూర్తి గుడ్డు తింటే వీరికి మేలు కలుగుతుంది.

- డాక్టర్ మమత, పోషకాహార నిపుణులు, కరీంనగర్

పెరుగుతున్న వినియోగం



ఉమ్మడి జిల్లాలో గుడ్ల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతోంది. ఇందుకు తగినట్లుగా వినియోగం ఎక్కువగానే ఉంటోంది. రోజులో 50లక్షలకుపైగా గుడ్లు ఉత్పత్తి అవుతుండగా.. జిల్లాలో సరఫరాతో పాటు ఇతర రాష్ట్రాలకు ఇక్కడి నుంచి ఎగుమతి ఇటీవల పెరిగింది. కరోనా తరువాత ప్రజల్లో గుడ్డును తింటే మంచిదనే అభిప్రాయం పెరిగింది.

- గొంటి సంతోష్, పౌల్ట్రీ యజమాని, కరీంనగర్

తెలుగు పండితుల విజయగాథలు

ధర్మపురి, న్యూస్‌టుడే: నిరంతరం శ్రమించి తమ కలలను నెరవేర్చుకున్నారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా మొక్కవోని ధైర్యంతో సాధనచేసి ఉపాధ్యాయ వృత్తికి ఎంపికయ్యారు. వీరిలో ఒక్కొక్కరిది ఒక్కో నేపథ్యం.

ప్రిన్సిపల్ ప్రోత్సాహంతో.. - మోహన్



ధర్మపురి మండలంలోని దొంతాపూర్‌కు చెందిన తుడుం మోహన్ ఓవైపు ఎలక్ట్రికల్ పనులు చేస్తూనే డీఎస్సీలో తెలుగు పండిట్‌కు ఎంపికయ్యారు. ఆయన తల్లిదండ్రులు నర్సయ్య, లక్ష్మి వ్యవసాయ కూలీలు. మోహన్ శ్రీ లక్ష్మీనరసింహ తెలుగు కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్ ప్రోత్సాహంతో హైదరాబాద్‌లోని సెంట్రల్ యునివర్సిటీలో ఎంఏ తెలుగు పూర్తి చేశాడు. ఇటీవలి డీఎస్సీ ఫలితాల్లో పండిట్ ఉద్యోగం సాధించారు.

టైలరింగు చేస్తూ.. - మౌనిక



టైలరింగు చేసుకుంటూ తెలుగు పండిట్ ఉద్యోగం సాధించారు ధర్మపురి మండలంలోని పెద్ద నక్కలపేటకు చెందిన అజ్మీర పున్నంనాయక్-కళ దంపతుల కూమార్తె మౌనిక. ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేశారు. టైలరింగ్ చేస్తూ కుటుంబానికి బాసటగా నిలిచారు. వివాహం అయిన పట్టు వదలకుండా ఉపాధ్యాయులు రంగ శ్రీనివాస్ స్ఫూర్తితో ఉద్యోగం సాధించానని చెబుతున్నారు మౌనిక.

వృత్తిపై మమకారంతో.. - అభిషేక్



పట్టణానికి చెందిన మాడిశెట్టి అభిషేక్.. చిన్ననాటి నుంచి ఉపాధ్యాయ వృత్తిపై మమకారంతో సాధన చేశారు. తండ్రి మల్లేశం టైలర్ కావడంతో.. ఉదయం టైలరింగులో చేదోడు వాదోడుగా ఉంటూ.. ధర్మపురి తెలుగు కళాశాలలో బీఏఎల్ పూర్తి చేశాడు. ఎల్పీ, స్కూల్ అసిస్టెంటు విభాగం రెండింటిలోనూ జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకును సాధించి తెలుగు పండిట్ ఉద్యోగం సాధించారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ


కీర్తి


సాత్వికాంజలి


జగిత్యాల, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ప్రతిభ చాటారు. హన్మకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండ్రోజులపాటు జరిగిన 10వ తెలంగాణ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ రాష్ట్ర స్థాయి క్రీడాపోటీల్లో పాల్గొన్న అమర్లపూడి కీర్తి 10 కిలోమీటర్ల రేస్‌వాక్ విభాగంలో ప్రథమస్థానం సాధించి బంగారు పతకం కైవసం చేసుకుంది. 400 మీటర్ల హర్డిల్స్ విభాగంలో మామిడాల సాత్వికాంజలి తృతీయ స్థానం సాధించి కాంస్య పతాకాన్ని దక్కించుకుంది. పతకాలు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ గునుక శ్రీలత, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎల్. హరిరాం అభినందించారు. జిల్లాకు చెందిన విద్యార్థినిలు పతకాలు సాధించడం పట్ల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

నాచు పెరిగినా పట్టించుకునే నాథుడు లేడు



శ్రీరాంసాగర్ జలాశయం నుంచి బోల్‌చెరువు రిజర్వాయర్ ద్వారా సాగునీరు అందించాల్సిన బీసీ ప్రధాన కాలువ ఇలా మురుగుకాలువను తలపిస్తోంది. రాయపట్నం వైపు నుంచి స్తంభంపల్లి మీదుగా పాశిగామ, కోటిలింగాల చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాల్సిన ఈ కాలువ నిర్వహణ పూర్తిగా కొరవడింది. ఫలితంగా సమీప ప్రజలు దోమల బెడదతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. - వెల్గటూరు, న్యూస్‌టుడే

తహసీల్దార్ల బదిలీల్లో కదలిక



జగిత్యాల, న్యూస్‌టుడే: ఎన్నికల కోడ్ నేపథ్యంలో శాసనసభ, లోక్‌సభ ఎన్నికల సందర్భంగా జిల్లా నుంచి ఇతర జిల్లాలకు బదిలీ అయిన తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్ల బదిలీపై కదలిక వచ్చింది. ఎన్నికలు ముగిసినప్పటి నుంచి పూర్వ జిల్లాలకు వెళ్లేందుకు ఎదురు చూస్తున్న తహసీలార్లు, నాయబ్ తహసీల్దార్లు మూడురోజుల్లో దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర భూపరిపాలన ముఖ్య కమిషనర్ నవీన్ మిట్టల్ జిల్లా కలెక్టర్లకు లేఖ రాశారు. జిల్లా నుంచి గత ఎన్నికల ముందు నలుగురు తహసీల్దార్లు నిజామాబాద్ జిల్లాకు ముగ్గురు పెద్దపల్లి, ముగ్గురు రాజన్న సిరిసిల్ల, ఇద్దరు కరీంనగర్, ఇద్దరు జయశంకర్ భూపాలపల్లి, ఒకరు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. నిజామాబాద్, మంచిర్యాల, కరీంనగర్, నిర్మల్ జిల్లాల నుంచి 16 మంది తహసీల్దార్లు జిల్లాకు వచ్చారు. గత లోక్‌సభ ఎన్నికల ముందు నలుగురు నాయబ్ తహసీల్దార్లు నిజామాబాద్ జిల్లాకు వెళ్లగా ఆ జిల్లా నుంచి నలుగురు ఇక్కడికి వచ్చారు. దీంతోపాటు పలువురు నాయబ్ తహసీల్దార్లు తహసీల్దార్లుగా పదోన్నతి పొంది ఇతర జిల్లాలకు వెళ్లగా వారు సైతం తిరిగి సొంత జిల్లాకు వచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. దసరాలోపు ఎన్నికల బదిలీలకు సంబంధించిన తహసీల్దార్లను పూర్వ జిల్లాలకు పంపేందుకు చర్యలు తీసుకుంటామని ఇటీవల తహసీల్దార్ల రాష్ట్ర సదస్సులో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చిన నేపథ్యంలో బదిలీలపై కసరత్తు జరుగుతుంది. మొత్తం మీద ఈనెలలో బదిలీల ప్రక్రియ జరగనున్నట్లు తెలుస్తోంది.

స్టేషన్‌కు వచ్చేవారికి సత్వర న్యాయం


మేడిపల్లి ఠాణాను తనిఖీ చేస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

మేడిపల్లి, న్యూస్‌టుడే: పోలీస్ స్టేషన్‌కు న్యాయం కోరి వచ్చే వారికి భరోసా కల్పించాలని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. మేడిపల్లి పోలీస్ స్టేషన్‌ను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు చేరువయ్యేలా పోలీసులు విధులు నిర్వర్తించాలని, ప్రజా సమస్యలపై వెంటనే స్పందించాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రస్తుతం నేరాల శాతం తగ్గిందని, సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్సై, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని పేర్కొన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మేడిపల్లి ఠాణా ఆవరణలో ఎస్పీ మొక్క నాటారు. డీఎస్పీ ఉమా మహేశ్వర్ రావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సైలు శ్యాంరాజ్, శ్రీకాంత్, నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

పూల కొరత.. కిలో రూ.200


వెల్గటూరులో బంతిపూల కొనుగోలుకు ఎగబడుతున్న జనం

వెల్గటూరు, న్యూస్‌టుడే: సద్దుల బతుకమ్మ సందర్భంగా గురువారం బంతిపూల కొరత ఏర్పడింది. ఒక దుకాణంలోకి అప్పుడే బంతిపూల బస్తాలు రావడంతో ఒక్కసారిగా జనం ఎగబడ్డారు. వీటి డిమాండ్ దృష్ట్యా దుకాణదారులు వాటిని ధరను కిలో రూ.100 నుంచి రూ.200కు పెంచారు. తప్పనిసరి పరిస్థితుల్లో చెప్పినంత ఇచ్చి కొనుగోలు చేసుకున్నారు.

విహారం.. వినోదం.. వికాసం

కుటుంబ సభ్యులతో కలిసి పర్యటనలు ■ దసరా సెలవుల సద్వినియోగం



న్యూస్‌టుడే, కరీంనగర్ సాంస్కృతికం

జీవితం పరుగులమయమైంది. పొద్దున లేచింది మొదలు రాత్రి నిద్రించే వరకు పని ఒత్తిళ్లు.. ఆలోచనలు చుట్టుముట్టేస్తున్నాయి. పిల్లలైతే బడికి వెళ్లిరావడం.. హోంవర్క్ అంటూ రాత్రి వరకు మేల్కొని ఉంటున్నారు. సెలవులు వచ్చాయంటే చాలు ఇంట్లో వారందరికీ కొద్దిగా విరామం లభిస్తుంది. హమ్మయ్య.. కాస్త తీరిక దొరికిందనే భావన వచ్చేస్తుంది. కుటుంబ సంక్షేమం.. వికాసం.. ఆనందం గురించి ఆలోచించేవారు కొద్దిగా బయటకు వెళ్లి రావాలని భావిస్తున్నారు. ఇటీవల చాలా కుటుంబాలు ఆహ్లాద ప్రదేశాలకు వెళ్లి వస్తున్నాయి. జిల్లా నుంచి మొదలుకుంటే విదేశాల వరకు పర్యటిస్తున్నారు. దసరా సెలవుల నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లావాసులు ఎలాంటి ప్రదేశాలకు వెళ్తున్నారో 'న్యూస్‌టుడే' కథనం.

ఆధ్యాత్మిక, పర్యాటక..

■ ఉమ్మడి జిల్లాలో ఆధ్యాత్మిక పర్యాటక ప్రాంతాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇష్టమైన దైవ దర్శనాలు చేస్తే కనీసం పుణ్యంతోపాటు మనసు కుదుటపడుతుందని భావిస్తున్నారు.

■ ఒత్తిడికి దూరంగా, ప్రకృతి రమణీయ ప్రాంతాలకు వెళ్తున్నారు. మన వద్ద ఆహ్లాదకర ప్రదేశాలు తక్కువే. రెండ్రోజులు గడిపే విధంగా అనువైన ప్రాంతాలు లేవు. నాగార్జునసాగర్, పాపికొండలు, విశాఖపట్నం, అరకు, తమిళనాడు, కేరళలాంటి ప్రాంతాలను చుట్టేస్తున్నారు.

■ బడ్జెట్, సమయం చూసుకొని తిరుపతితోపాటు పుణ్యక్షేత్రాలను సందర్శిస్తున్నారు. తీర్థయాత్రలకు వెళ్లేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. వారణాసి, అయోధ్య ప్రాంతాలు బాగా అభివృద్ధి చెందాయని తెలుసుకొని చాలామంది అక్కడికీ వెళ్తున్నారు.

■ మరికొందరు విదేశాలకు వెళ్తున్నారు. ఎక్కువ మంది సింగపూర్, మలేషియా, శ్రీలంక, దుబాయ్, థాయ్‌లాండ్ తదితర దేశాలకు వెళ్లడానికి ఆసక్తి చూపిస్తున్నారు. మిత్రులతో కొందరు, కుటుంబీకులతో మరికొందరు వెళ్తున్నారు.

పర్యాటక వాహనాలకూ డిమాండ్

■ ఉమ్మడి జిల్లాలోని ప్రాంతాలను, ఇతర జిల్లాలోని జలపాతాలను ఒక రోజులో చుట్టేసి వస్తున్నారు. సొంత కార్లు ఉన్నవారే కాకుండా.. అద్దె వాహనాలు తీసుకొని వెళ్లి వీటి అందాలు చూసి వస్తున్నారు.



■ మరికొందరు కార్డిల్లా క్రూజ్ టూకు ఇష్టపడుతున్నారు. సముద్రంలో ఓడలో ప్రయాణించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ముంబయి నుంచి గోవాకు, గోవా నుంచి చెన్నై, చెన్నై నుంచి శ్రీలంకకు వెళ్లేందుకు పర్యాటక ప్యాకేజీలున్నాయని ఒక ట్రావెల్ ఏజెన్సీకి చెందిన కుర్ర శ్రీకాంత్ తెలిపారు.

మరచిపోలేని మలేషియా పర్యటన

ఇటీవల మిత్రులతో కలిసి మలేషియా పర్యటనకు వెళ్లాం. మలేషియా నుంచి విమానంలో గంట ప్రయాణం చేస్తే లంకావి అనే ప్రాంతం వస్తుంది. ఇక్కడ సముద్రంలో అరగంట ప్రయాణించిన తర్వాత సూర్యాస్తమయం దగ్గరి నుంచి చూసే అవకాశముంది. ప్రపంచంలోని చాలామంది పర్యాటకులు దీనిని చూసేందుకు వస్తుంటారు. స్కై బ్రిడ్జి కారు, సముద్రంలో లోపల ఉన్న మ్యూజియంలో రకరకాల చేపలు చూసి ఆశ్చర్యపోవాల్సిందే. ఇక్కడి బాటు కేవ్స్‌లో మన హిందూ దేవాలయాలు ఉంటాయి. సుబ్రహ్మణ్య స్వామి విగ్రహం చూడదగినది. ట్విన్ టవర్స్ ప్రాంతంలో ఎంజాయ్ చేశాం. ఈ పర్యటన జీవితాంతం గుర్తుండటమే కాకుండా మంచి అనుభూతి కల్గించింది.



మలేషియా ట్విన్ టవర్స్ వద్ద శ్రీపాల్‌రెడ్డి

వీరి ప్రదర్శన చూస్తే.. ఔరా అనాల్సిందే!

న్యూస్‌టుడే, జ్యోతినగర్, మార్కండేయ కాలనీ

అకాడ శిక్షణలో అబ్బుర పరుస్తున్న చిన్నారులు

కనుమరుగవుతున్నాయి అనుకుంటున్న ప్రాచీన యుద్ధ కళలు మళ్లీ పురుడు పోసుకుంటున్నాయి. కర్రసాము, కత్తిసాముతో సాహస విన్యాసాలు చేస్తూ యుద్ధ విద్యను నేర్చుకుంటున్నారు ఈ చిన్నారులు. దసరా సందర్భంగా ఎన్టీపీసీకి చెందిన కంది రాజయ్య జ్ఞాపకార్థంగా అతని కుమారుడు శ్రీహనుమాన్ అకాడ శిక్షకులు కంది నాగరాజు ఆధ్వర్యంలో 30 ఏళ్లుగా ఉచితంగా స్థానిక విశ్వభారతి ఉన్నత పాఠశాలలో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు శిక్షణిస్తున్నారు. ఈ కేంద్రానికి చిన్నారులు తరలివచ్చి శిక్షణ పొందుతున్నారు.

పలు అంశాల్లో..

అకాడలో శిక్షణ నేర్చుకుంటున్న బాల, బాలికలకు కత్తి, కర్రసాము, తలపై కొబ్బరికాయ పగలగొట్టడం, కడుపుపై అరటిపండును కత్తితో కోయడంతోపాటు ఇతర విన్యాసాలు శిక్షణలో భాగం. దీంతో ప్రతి ఒక్కరికి ఆత్మ స్థైర్యం పెరగడంతోపాటు ముఖ్యంగా ఏకాగ్రత పెరుగుతోంది. ఆత్మ రక్షణ పొందే పలు అంశాలపై పట్టు లభిస్తుంది. ప్రతి విజయదశమి సందర్భంగా చిన్నారులకు విన్యాసాలు నేర్పడంతోపాటు ఉత్సవాల్లో ప్రతిభను ప్రదర్శిస్తూ మన్ననలు అందుకుంటున్నారు.



చిన్నారులకు కత్తి, కర్రసాము శిక్షణ ఇస్తున్న కోచ్ నాగరాజు

యుద్ధ విద్య అవసరం..



- హారిణి, విద్యార్థిని

యుద్ధ విద్య నేర్చుకుంటే ఎటువంటి ఆపద నుంచి అయినా బయటపడవచ్చు. దేశంలో సంస్కృతి, సంప్రదాయాల కొనసాగింపులో భాగంగా ఆనవాయితీగా వస్తున్న కళలను ప్రోత్సహించడంతోపాటు యుద్ధ విద్య ద్వారా ఏకగ్రాత, ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఈ విద్య ముఖ్యంగా అమ్మాయిలకు అవసరం.

ప్రాచీన కళను వెలికితీయాలని..

- కంది నాగరాజు, అకాడ శిక్షకులు

ఆంగ్లేయుల కాలంలో జమీందారీలు ఈ విద్యను ప్రోత్సహించేవారు. విజయనగర సామ్రాజ్యంలో సంస్థాన సామంతరాజు కత్తి, కర్రసాములను జౌత్సాహిక ప్రదర్శనలుగా చేపట్టేవారు. యుద్ధ విద్యతో ప్రతి ఒక్కరికి మరింత నైపుణ్యం, గెలుపు, ఆత్మవిశ్వాసం, శరీర ఆకృతి, ఆత్మరక్షణ పెరుగుతుంది. ప్రాచీన యుద్ధ విద్యను పలువురికి నేర్పి పూర్వ వైభవాన్ని తీసుకురావడమే నా లక్ష్యం.

కర్రసాముపై ఆసక్తి.. - నిస్సీ, విద్యార్థిని



చిన్నప్పటి నుంచి కర్రసాము అంటే ఇష్టం. సాధారణంగా చరవాణిలో కర్ర, కత్తిసాము ప్రదర్శనలు చూస్తుంటే నాతో సాధ్యమవుతుందా అనే ఆలోచన వచ్చేది. నా ఆసక్తికను గుణంగా ఉచితంగా ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకునే దిశగా అకాడలో చేరాను. ప్రస్తుతం కర్ర, కత్తిసాము సాధన చేస్తున్నా. ఏదైనా నేర్చుకోవాలన్న తపన, సాధన చేస్తే తప్పనిసరిగా విజయం సాధిస్తాం.

గీత కార్మికులందరికీ రక్షక కవచాలు

కరీంనగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని దాదాపు 2 లక్షల మంది గీత కార్మికులకు కాటమయ్య రక్షక కవచాలను అందిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. గురువారం కరీంనగర్-రామగుండం బైపాస్ రోడ్డులోని రేణుక ఎల్లమ్మ ఆలయ ఆవరణలో గీత కార్మికులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన కాటమయ్య రక్షక కిట్లను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి పంపిణీ చేశారు. అనంతర మంత్రి మాట్లాడుతూ... ఈ రోజు వంద అసెంబ్లీ నియోజకవర్గాల్లో 10 వేల కిట్లు పంపిణీ చేశామన్నారు. ఇప్పటికే జిల్లాలో వెయ్యి మంది గీత కార్మికులకు కిట్ల వినియోగంపై శిక్షణ ఇచ్చామన్నారు. హైదరాబాద్ ఐఐటీ వారు ఈ కిట్టు నాణ్యతను ధ్రువీకరించారన్నారు. జారి పడిపోకుండా జాకెట్ రక్షిస్తుందని, ఓ గీత కార్మికుడు మంత్రి, కలెక్టర్ సమక్షంలో ప్రదర్శించి చూపించారు.

నాలుగు పాఠశాలలకు శంకుస్థాపన..: రాష్ట్ర ప్రభుత్వం మరో కొత్త పథకాన్ని ప్రారంభిస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. శుక్రవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో హుస్నాబాద్, ధర్మపురి, మానకొండూరు, మంథనిలో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్' పాఠశాలల నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో ఉన్న వసతిగృహాలను, గురుకులాలను జిల్లా కలెక్టర్‌తోపాటు అధికారులు సందర్శించాలన్నారు. మానేరు రివర్ ఫ్రంట్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, డంపింగ్ యార్డును పూర్తిగా తొలగించే చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్, ఆబ్కారీ శాఖ పర్యవేక్షకులు శ్రీనివాసరావు, బీసీ సంక్షేమాధికారి అనిల్ ప్రకాశ్, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణగౌడ్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస గౌడ్, కార్పొరేటర్ ఐలేందర్, గౌడ సంఘ నాయకులు ఆదర్శ సత్యనారాయణ గౌడ్, తిరుపతి గౌడ్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి రేణుకా ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేశారు.



గీత కార్మికుడికి కాటమయ్య రక్షక కవచాన్ని అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి, అధికారులు

ఆర్టీసీ బస్సు ఢీకొని హోంగార్డు దుర్మరణం



సుబ్బరాజు

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో హోంగార్డు దుర్మరణం చెందిన ఘటన మెట్‌పల్లి పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లికి చెందిన ఓంకారం సుబ్బరాజు(43) జగిత్యాల గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఉదయం పట్టణ శివారులోని హోటల్ నుంచి అల్పాహారం తీసుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా ఆర్మూర్ వైపు నుంచి జగిత్యాల వైపు వెళ్తున్న నిజామాబాద్ డిపోనకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుబ్బరాజు తల పైనుంచి బస్సు వెనుక చక్రం వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహానికి శవపరీక్ష నిర్వహించి కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. సుబ్బరాజుకు భార్య, కుమార్తె, ముగ్గురు కుమారులు ఉన్నారు. సీఐ, హోంగార్డు ఆర్ఎస్సై సుమన్ పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.

ఎస్సారెస్పీ స్పిల్‌వే గేట్ల మూసివేత

జగిత్యాల ధరూర్‌క్యాంపు, న్యూస్‌టుడే: శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 11,590 క్యూసెక్కులకు తగ్గటంతో స్పిల్‌వేగేట్లను మూసివేశారు. ఎస్కేప్‌గేట్లద్వారా 1,200 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతుండగా వరదకాలువకు నీటివిడుదలను 2 వేల క్యూసెక్కులకు తగ్గించారు. కాకతీయ తదితర కాలువలు, ఎత్తిపోతలు, మిషన్ భగీరథ అవసరాలు కలుపుకుని మొత్తం ఔట్‌ఫ్లో 11,590 క్యూసెక్కులుగా ఉంది. ప్రాజెక్టులో గరిష్ఠస్థాయిలో 80.501 టీఎంసీల నీటినిల్వ, 1091.0 అడుగుల నీటిమట్టం ఉంది.

రెండు బ్యాచ్‌లు.. 48 మందికి కొలువులు

డీఎస్సీలో సత్తాచాటిన కరీంనగర్ డైట్ విద్యార్థులు

న్యూస్‌టుడే-కరీంనగర్ విద్యావిభాగం

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీలోని డైట్ కళాశాలలో డీఎడ్ పూర్తి చేసిన ఒకే బ్యాచ్‌కు చెందిన అభ్యర్థుల్లో ఎక్కువ మంది డీఎస్సీ-2024లో ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికై ప్రత్యేకత చాటుకున్నారు. 2015-17 బ్యాచ్ అభ్యర్థులు 28 మంది (25 మంది ఎస్జీటీలుగా, ముగ్గురు స్కూల్ అసిస్టెంట్లుగా) కొలువులు సాధించారు. ఆ బ్యాచ్‌లో వంద మంది ఉండగా, ఈ ఏడాది జరిగిన డీఎస్సీకి హాజరైన ఆ బ్యాచ్‌లోని 28 మంది తమ కలను నిజం చేసుకున్నారు. వీరిలో ఉమ్మడి కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల వారు ఉన్నారు. ఇదే కళాశాలలో చదివిన 2014-16 బ్యాచ్ విద్యార్థులు 20 మంది ఉద్యోగాలు సాధించారు. వివిధ జిల్లాలకు చెందిన వీరు మంగళవారం హైదరాబాద్‌లో నియామక పత్రాలను అందుకున్న సందర్భంగా కలుసుకొని పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. ఇదే కళాశాలలో చదివిన మరో బ్యాచ్ అభ్యర్థిని హనుమకొండ జిల్లాలో ఎస్జీటీ టాపర్‌గా, మరో అభ్యర్థిని కరీంనగర్ జిల్లా టాపర్‌గా నిలవడం గమనార్హం. అధ్యాపకుల బోధన, వారి ప్రోత్సాహం ఉద్యోగాల సాధనకు ఉపయోగపడిందని పలువురు తెలిపారు. ఉద్యోగాలు సాధించినవారిని డైట్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.మొండయ్య, అధ్యాపకులు డాక్టర్ శంకర్, సి. హెచ్.ప్రద్యుమ్నకుమార్, మహేశ్వర్‌రెడ్డి, మంజుల తదితరులు అభినందించారు.



ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన 2015-17 డీఎడ్ బ్యాచ్ అభ్యర్థులు



2014-16 డీఎడ్ బ్యాచ్ అభ్యర్థులు

అన్నా చెల్లెళ్లకు ఒకేసారి..



సుస్మిత, సురేష్

ముత్తారం, న్యూస్‌టుడే: మండలంలోని కేశనపల్లికి చెందిన అన్నాచెల్లెలు ఒకేసారి ఉపాధ్యాయ కొలువులు సాధించారు. కేశనపల్లికి చెందిన కోళ్ల రాధ-కొమురయ్యలకు ముగ్గురు సంతానం. వీరు వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించారు. ఇటీవల డీఎస్సీ ఫలితాల్లో చిన్న కొడుకు సురేష్ స్కూల్ అసిస్టెంట్ విభాగంలో, కూతురు సుస్మిత ఎస్జీటీలో రెండో ర్యాంక్ పొందారు. ప్రస్తుతం సురేష్ జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని గురుకులంలో విధులు నిర్వహిస్తున్నాడు.

శ్రమించారు.. కలిసి కొలువు సాధించారు



సతీశ్, మౌనిక దంపతులు

సిరిసిల్ల(విద్యానగర్), న్యూస్‌టుడే: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన దంపతులు గుంటుకు సతీశ్, గజ్జెల్లి మౌనికలు డీఎస్సీ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎస్జీటీలుగా ఎంపికయ్యారు. వీరికి 2019లో వివాహం జరిగింది. ఒక పాప ఉంది. సతీశ్ ఓ చిట్‌ఫండ్స్ కంపెనీలో పని చేసేవాడు. 2017లో డీఎస్సీ రాసినప్పటికీ రాలేదు. మౌనిక ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయినిగా పని చేసేది. ఇద్దరూ ఉద్యోగాలకు రాజీనామా చేసి రెండు సంవత్సరాల పాటు పరీక్షలకు సన్నద్ధమయ్యారు. ఇందుకు ఆర్థికంగా ఇరువురి కుటుంబ సభ్యులు సహాయపడ్డారు. పాపను సతీశ్ లేదా మౌనిక తల్లిదండ్రులు చూసుకునేవారని, అందువల్లే తాము పూర్తిగా చదువుపై శ్రద్ధ పెట్టగలిగామని చెబుతున్నారు. సిరిసిల్లలోని సినారె గ్రంథాలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు పుస్తకాలతో కుస్తీ పట్టి లక్ష్యాన్ని సాధించారు. గ్రంథాలయం వద్ద అన్నపూర్ణ క్యాంటీన్‌లో అందించే రూ.5 భోజనం తింటూ చదువుకున్నారు. వీరి స్నేహితుడు శ్రీకాంత్‌తో కలిసి పాఠ్యాంశాలపై ఎప్పటికప్పుడు చర్చించుకునేవారు. ఇది బాగా ఉపయోగపడిందని చెప్పారు. పట్టుదలతో కృషి చేస్తే సాధించలేనిది ఏదీ లేదని చెబుతున్నారు ఈ దంపతులు.

కష్టాలకు ఎదురొడ్డి.. లక్ష్యాన్ని చేరుకొని



స్వప్న

కరీంనగర్ కలెక్టరేట్, కొత్తపల్లి, న్యూస్‌టుడే: చదువుకు పేదరికం అడ్డుకాదని నిరూపించింది ఆ యువతి. తండ్రి చిన్నప్పుడే చనిపోగా.. తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. అయినా మొక్కవోని ధైర్యంతో లక్ష్యం వైపు అడుగులేసి ఉపాధ్యాయ ఉద్యోగం సాధించి తన కలను సాకారం చేసుకొంది కరీంనగర్ శివారు కొత్తపల్లికి చెందిన స్వప్న. దూస శారద-లక్ష్మీరాజం దంపతులకు ముగ్గురు కూతుళ్లు. వారిలో చిన్న కూతురు స్వప్న. అక్కలిద్దరవి పెళ్లిలు కాగా.. వేరే ప్రాంతాల్లో ఉంటున్నారు. స్వప్న చిన్నప్పటి నుంచి సర్కారు బడుల్లోనే చదువుకుంది. అక్కడ పాఠాలు బోధించే ఉపాధ్యాయులను చూసి, ఆ ఉద్యోగం సాధించాలని ఆశయంగా పెట్టుకుంది. తండ్రి చిన్నప్పుడే మరణించగా.. తల్లి బీడీలు చుడుతూ చదివించింది. స్వప్న ఇంటి వద్ద ట్యూషన్లు చెప్పేది. డీఎస్సీ నోటిఫికేషన్ అనంతరం తల్లి సైతం మరణించింది. ఓ వైపు దుఃఖాన్ని దిగమింగుకొని పరీక్షకు సిద్ధమైంది. ఇటీవల విడుదలైన ఎస్జీటీ ఫలితాల్లో 18వ ర్యాంకు సాధించింది. బుధవారం హైదరాబాద్‌లో ఉద్యోగ నియామక పత్రం అందుకుంది.

కూలీ నుంచి ఉపాధ్యాయుడిగా..



నిరుపేద కుటుంబం.. ఉండటానికి సరైన గూడు లేదు.. పనిచేస్తేనే పూట గడిచే పరిస్థితి.. ఓ వైపు కూలీ పనికి వెళ్తూనే పోటీ పరీక్షలకు సన్నద్ధమై ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాడు. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం అయిలాపూర్ మేజర్ గ్రామానికి చెందిన పాశం శంకర్-గంగు దంపతులకు ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు. వీరి కుమారుడు ప్రశాంత్ చిన్నప్పటి నుంచి చదువులో చురుకుగా ఉండేవాడు. 6 నుంచి 12 వరకు మేడిపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదివాడు. టీటీసీలో సీటు రాగా సిరిసిల్ల జిల్లాలోని తంగళ్లపల్లిలో 2017-19లో పూర్తిచేశాడు. తండ్రి శంకర్ కూలీ పనులకు వెళ్తుండగా తల్లి అనారోగ్యంతో ఇంటికే పరిమితమైంది. తండ్రి కూలీ పనులకు వెళ్తేనే పూటగడిచేది. దీంతో ప్రశాంత్ పెయింటింగ్‌తో పాటు కూలీ పనులకు వెళ్తూ కుటుంబానికి అండగా ఉండేవాడు. ఉదయం కూలీ పనికి వెళ్తూ రాత్రిళ్లు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యాడు. ఇటీవల విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీగా ఎంపికయ్యాడు. బుధవారం ఉపాధ్యాయ నియామక పత్రం అందుకోగా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు సంతోషంలో మునిగిపోయారు. – న్యూస్‌టుడే, కోరుట్ల

మట్టిలో మాణిక్యాలు



వేణుగోపాల్



ప్రశాంత్

శంకరపట్నం : కేశవపట్నం గ్రామానికి చెందిన హమాలీ, కూలీల బిడ్డలు ప్రభుత్వ ఉపాధ్యాయ కొలువులు సాధించారు. కేశవపట్నం గ్రామానికి చెందిన జూల వెంకటలక్ష్మి-శ్రీనివాస్ దంపతుల కుమారుడు వేణుగోపాల్ స్థానిక ఉన్నత పాఠశాలలో పదో తరగతి, హుజూరాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్, కరీంనగర్‌లో డిగ్రీ, బీఎడ్ చేశారు. తండ్రి శ్రీనివాస్ హమాలీ కార్మికుడు కాగా.. తల్లి వ్యవసాయ కూలీ పనులు చేస్తూ కొడుకు వేణుగోపాల్‌ను చదివించారు. వేణుగోపాల్ సైతం సోదరుడితో కలిసి ఖాళీ సమయాల్లో వేడుక మందిరాల్లో డెకరేషన్‌గా కూలీ పనులు చేస్తూ ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగారు. కూలీ పనులు చేస్తూ ఓ పక్క ప్రభుత్వ ఉద్యోగం కోసం శ్రమించారు. ఇంటి వద్దనే ఉండి డీఎస్సీ పరీక్షకు సిద్ధమయ్యారు. డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ (సోషల్) ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. మొదటి సారి 2017లో డీఎస్సీ పరీక్ష రాసి ఉద్యోగానికి ఎంపిక కాలేదనే నిరుత్సాహం అతడిలో ధైర్యం నింపింది. రెండో ప్రయత్నంలో వేణుగోపాల్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఎంపిక అయ్యారు. తల్లిదండ్రులు కూలీ పనులు చేసి చదివించిన కష్టానికి ఫలితం దక్కిందని వేణుగోపాల్ పేర్కొన్నారు.

■ కేశవపట్నం గ్రామానికి చెందిన గొడిశాల ప్రశాంత్ తండ్రి తిరుపతి రైసుమిల్లులో కూలీ కాగా, తల్లి మాలతి రోజువారీ కూలీగా పని చేసేవారు. తాము పడ్డ కష్టం తమ కుమారుడు పడొద్దని బాగా చదవమనేవారు. ప్రశాంత్ స్థానిక ఉన్నత పాఠశాలలో పదో తరగతి, హుజూరాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ విద్యాభ్యాసం చేశారు. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ చదివిన ప్రశాంత్ టీటీసీ, బీఎడ్ పూర్తి చేశారు. డీఎస్సీ ఫలితాల్లో 72.27 మార్కులతో ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు.

పండగపూట స్తంభంపల్లిలో విషాదం

తేనెటీగల దాడిలో రైతు మృతి ■ మరో ముగ్గురికి తీవ్ర గాయాలు



లచ్చిరెడ్డి

బోయినపల్లి, న్యూస్‌టుడే: పంట పొలాల వద్ద పనులు చేసుకుంటున్న రైతులపై తేనెటీగలు దాడి చేయడంతో ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన బోయినపల్లి మండలం స్తంభంపల్లిలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కందాడి లచ్చిరెడ్డి (60), అతని కొడుకు నవీన్ రెడ్డి, మరో ఇద్దరు రైతులు రవీందర్‌రెడ్డి, రాజిరెడ్డిలు తమ వ్యవసాయ పొలాల్లో పనులు చేసుకుంటున్నారు. సమీపంలోని చెట్టుపై కొమ్మ విరిగి తేనెటీగలపై పడటంతో ఒక్కసారిగా లేచాయి. పొలంలో పనులు చేసుకుంటున్న లచ్చిరెడ్డి, నవీన్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, రాజిరెడ్డిలపై దాడి చేశాయి. వాటి నుంచి కాపాడుకోవడానికి పరుగు తీసి మంట పెట్టే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. లచ్చిరెడ్డి, నవీన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తీవ్రంగా గాయపడటంతో వేములవాడలోని ఓ ఆసుపత్రికి తరలించారు. లచ్చిరెడ్డిని పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. పండగ రోజు రైతు మృతి చెందడంతో గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న ఎస్సై పృథ్వీధర్ గౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. లచ్చిరెడ్డికి భార్య వినోద, కొడుకు నవీన్‌రెడ్డి, కూతురు రజిత ఉన్నారు.

యువకుడి దారుణ హత్య

వివాహేతర సంబంధమే కారణమా?



వినయ్‌కుమార్

యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే: గోదావరిఖని యైంటిక్లయిన్ కాలనీ హనుమాన్‌నగర్‌లో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. వివాహేతర సంబంధమే కారణమన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసుల కథనం ప్రకారం.. హనుమాన్‌నగర్‌కు చెందిన వడ్డాది వినయ్‌కుమార్(25) స్కావెంజర్‌గా విధులు నిర్వహించేవాడు. ఖనికి చెందిన ఓ వివాహితతో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఆమె భర్త, పిల్లలను వదిలి మూడు నెలలుగా వినయ్‌కుమార్‌తో కలిసి ఉంటోంది. గురువారం మధ్యాహ్నం ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు.. ఆయుధాలతో వినయ్‌కుమార్‌పై దాడిచేయడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. తన కుమారుడిని వివాహిత సోదరుడు, భర్త కలిసి హత్య చేశారని మృతుడి తండ్రి కుమారస్వామి పోలీసులకు తెలిపారు. సంఘటన స్థలాన్ని ఏసీపీ రమేష్ పరిశీలించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా... (10 AM TO 1 PM)
జగిత్యాల 94400 23123
కోరుట్ల 9491324656 ధర్మపురి 94403 88638

న్యూస్‌టుడే, ధర్మపురి

? ధర్మపురి పట్టణంలో రహదారులు అధ్వాన్నంగా మారాయి. వీటిని దసరా పండుగ లోపైనా మరమ్మతు చేయాలి. **- శ్రీనివాస్, ధర్మపురి**
✓ క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి తాత్కాలికంగా మరమ్మతు జరిపేలా చర్యలు తీసుకుంటాం. **- పుర కమిషనర్ బాలె గంగాధర్**

- న్యూస్‌టుడే, కోరుట్ల
? కోరుట్ల పట్టణం శ్రీనివాస్‌రోడ్డు మధ్యలోని మురుగు కాలువ పైపు పగిలి గుంత ఏర్పడింది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. **- శ్రీనివాస్, కోరుట్ల**
✓ దెబ్బతిన్న మురుగు కాలువల పైకప్పులు మరమ్మతు చేసేందుకు నిధులు కేటాయించాం. త్వరలోనే పనులు చేపడతాం. **- తిరుపతి, కమిషనర్**

న్యూస్‌టుడే, జగిత్యాల ధరూర్‌క్యాంపు

? చెత్తను తరలించే వాహనాలు రోజులతరబడి రావటంలేదు. **- సత్యం, విజయపురి**
✓ కొన్ని వాహనాలు మరమ్మతులో ఉండగా ఆలస్యమవుతోంది. వాహనాల మరమ్మతుతో పాటుగా నూతనంగా మరికొన్ని వాహనాలు తెప్పిస్తున్నాము. **- సమ్మయ్య, పురపాలక కమిషనర్, జగిత్యాల**

చిన్న గరుడవాహనంపై చెన్నకేశవస్వామి దర్శనం



నవరాత్రుల సందర్భంగా పట్టణంలోని శ్రీచెన్నకేశవస్వామి చిన్నగరుడ వాహనంపై గురువారం భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మహిళలు మంగళ హారతులతో స్వామివారి రథానికి స్వాగతం పలికారు. **- న్యూస్‌టుడే, మెట్‌పల్లి పట్టణం**



గురువులతో విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మెట్‌పల్లి పట్టణం : పట్టణంలోని వాసవి హైస్కూల్‌లో చదివిన 1998-1999 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం గురువారం నిర్వహించారు. విద్యనేర్పిన గురువులను సత్కరించారు. ఉపాధ్యాయులు మనోహరశర్మ, మహేష్, ప్రదీప్, సాంబయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గరుడ వాహన సేవ

సారంగాపూర్, న్యూస్‌టుడే: బీర్‌పూర్ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో నవరాత్రులలో భాగంగా గురువారం స్వామివారిని గరుడ వాహన సేవలో ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకులు వొద్దిపర్తి సంతోషాచార్యులు, మధుకుమారాచార్యులు, చిన్న సంతోషాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం స్వామివారిని గరుడ వాహనంపై ఊరేగించారు.



గరుడ వాహన సేవలో స్వామివారు

భారీ వర్షంతో అన్నదాతల హర్షం

ధర్మపురి గ్రామీణం: మండలంలోని రాయపట్నం, తిమ్మాపూర్, బూరుగుపల్లె గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. అంతర్‌జిల్లా సరిహద్దు రాయపట్నం చౌరస్తా జలమయమైంది. తుమ్మెనాల, నేరెల్ల, బుద్దేశ్‌పల్లెతోపాటు పలు గ్రామాల్లో స్వల్పంగా వర్షం కురిసింది. ఎండల వల్ల పత్తి పంటకు నష్టం కలుగుతుందని ఆందోళనలో ఉన్న రైతులకు.. నెలరోజులుగా ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న జనానికి వర్షం ఊరట కలిగించింది.

రతన్ టాటాకు నివాళి



రాయికల్‌లో నివాళులర్పిస్తున్న భాజపా నాయకులు

రాయికల్ పట్టణం, న్యూస్‌టుడే: పారిశ్రామిక దిగ్గజం, టాటా గ్రూప్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటాకు భాజపా పట్టణ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్టణంలోని సర్దార్ పటేల్, శివాజీ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు సమర్పించి కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. పుర అధ్యక్షుడు హన్మాండ్లు, కొన్నెలు శ్రీధర్‌రెడ్డి, మహేందర్, ధర్మపురి, శ్రీకాంత్‌రెడ్డి, సతీష్, భూమేష్, దివాకర్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల విద్యానగర్: జగిత్యాల పట్టణంలోని తహసీల్‌చౌరస్తా వద్ద భారత్ సురక్ష సమితి ఆధ్వర్యంలో ప్రముఖ వ్యాపారవేత్త దివంగత రతన్‌టాటాకు గురువారం నివాళులర్పించారు. బీఎస్‌ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు, అక్కినపల్లి కాశీనాథం, సింగం గంగాధర్, వేముల పోచమల్లు, నరేందుల శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, మల్లికార్జున్ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: భారత పారిశ్రామిక దిగ్గజం, పద్మవిభూషణ్ రతన్ టాటా విలువలకు కట్టుబడ్డ మహోన్నతవ్యక్తి అని కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం కొనియాడారు. మెట్‌పల్లిలో గురువారం రతన్ టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాంప్రసాద్, దిలీప్, రాజయ్య తదితరులున్నారు. జగ్గాసాగర్‌లో రతన్ టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



మెట్‌పల్లిలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వెల్గటూరు: ప్రముఖ వ్యాపార దిగ్గజం రతన్ టాటా మృతికి సంతాపంగా వెల్గటూరు, పాశిగామ గ్రామాల్లో గురువారం కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు.

వాలీబాల్ పోటీల విజేత కోరుట్ల



కోరుట్ల జట్టుతో ప్రభుత్వ విప్

ధర్మారం, న్యూస్‌టుడే : మండలంలోని నందిమేడారంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో కోరుట్ల జట్టు విజేతగా నిలిచింది. స్థానిక నందిని యూత్ క్లబ్ ఆధ్వర్యంలో మండల, జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీల్లో 22 జట్లు పాల్గొన్నాయి. తుది పోరులో నందిమేడారం జట్టుపై కోరుట్ల జట్టు గెలిచి విజేతగా నిలిచింది. విజేత, రన్నరప్ జట్లకు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ బహుమతులు అందించారు. ఏఎంసీ ఛైర్మన్ రూప్లానాయక్, వైస్ ఛైర్మన్ లింగయ్య, వాలీబాల్ అసోసియేషన్ ప్రతినిధులు రమణ, కోమల్, నందిని యూత్ క్లబ్ అధ్యక్షుడు వీరేపాల్ పాల్గొన్నారు.

ఘనంగా సద్దుల బతుకమ్మ



జగిత్యాల బైపాస్ రహదారిలో..



ధర్మపురిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



పెగడపల్లిలో..



మల్యాల: తొమ్మిదిన్నర అడుగుల బతుకమ్మ

సద్దుల బతుకమ్మ వేడుకలను గురువారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో సంప్రదాయ బద్ధంగా ఉయ్యాల పాటలు పాడుతూ ఆడారు. మళ్లీ రా గౌరమ్మ అంటూ సమీప చెరువులు, వాగుల్లో నిమజ్జనం చేసి వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. - న్యూస్‌టుడే యంత్రాంగం



కోరుట్లలో బతుకమ్మ ఆడుతున్న యువతులు



నెమలి బతుకమ్మతో యువతి



కొడిమ్యాలలో..



జగిత్యాల ధర్మశాల వద్ద..



మెట్‌పల్లి సుల్తాన్‌పురలో..



కండ్లపల్లిలో బతుకమ్మలతో యువతులు



కోరుట్లలో..



కోరుట్లలో..



రాయికల్‌లో..



జగిత్యాల: అన్నపూర్ణ కూడలిలో యువతులు

కాంగ్రెస్ ప్రభుత్వంలో యువతకు ఉద్యోగాలు

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తూ ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుందని మెట్‌పల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి అన్నారు. ఇటీవల డీఎస్సీ ఫలితాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సాధించిన మెట్‌పల్లి మండలం వేంపేటకు చెందిన శ్రీరాముల శృతిని గురువారం సన్మానించారు. అల్లూరి సురేందర్, అల్లూరి లింగారెడ్డి, కొట్టాల గంగారెడ్డి, రాజశేఖర్, శేఖర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, బాపురెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

శుద్ధజల కేంద్రం ప్రారంభం

కోరుట్ల, న్యూస్‌టుడే: కోరుట్ల మండలం పైడిమడుగు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన శుద్ధజల కేంద్రం(ఆర్వో ప్లాంట్)ను భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్ కుమార్ గురువారం ప్రారంభించారు. మండలాధ్యక్షుడు పంచిరి విజయ్‌కుమార్, ఇతర భాజపా, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలి

కోరుట్ల: పట్టణ పరిధిలోని అక్రమ లేఅవుట్లలోని ప్లాట్లను ఎల్‌ఆర్‌ఎస్-2020 స్కీం ద్వారా రూ.1000 చెల్లించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారు క్రమబద్ధీకరించుకోవాలని కమిషనర్ తిరుపతి గురువారం తెలిపారు. అక్రమ ప్లాట్లకు సంబంధిత భూపత్రాలను సమర్పించడంతోపాటు మిగతా నగదు మొత్తం చెల్లించి ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి బాసట

మల్లాపూర్: రేగుంటలో తీవ్ర అనారోగ్యానికి గురైన చందనగిరి రాజేష్(38) కుటుంబానికి గ్రామానికి చెందిన యువకులు బాసటగా నిలిచారు. రూ.1.03 లక్షల విరాళాలు సేకరించి బాధిత కుటుంబానికి అందజేశారు. మల్లేష్‌యాదవ్, సుధాకర్, కుందేళ్ల రాజేష్, రంపెకోత రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థుల సాయం

జగిత్యాల, న్యూస్‌టుడే: మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పేద విద్యార్థిని భాగ్యలక్ష్మికి కన్వీనర్ కోటాలో సిద్దిపేట సురభి వైద్య కళాశాలలో ఎంబీబీఎస్‌లో సీటు లభించినప్పటికి ఫీజు కట్టలేని పరిస్థితిలో ఉన్న విషయమై పత్రికల్లో కథనం వచ్చిన నేపథ్యంలో వైద్య విద్యార్థినులు స్పందించారు. జగిత్యాల ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు రూ.7 వేలు సమకూర్చగా కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, సూర్యాపేట ప్రభుత్వ కళాశాలల వైద్య విద్యార్థులు మరికొంత సొమ్ము సమకూర్చారు. మొత్తం రూ.40 వేలు సమకూరగా గురువారం విద్యార్థినికి పంపించారు.

పేద మహిళలకు చీరల పంపిణీ

మల్యాల, న్యూస్‌టుడే: మల్యాల మండలం నూకపల్లి గ్రామానికి చెందిన మారంపెల్లి వేణు, వాణి దంపతులు గురువారం నిరుపేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. బతుకమ్మ పండుగ సందర్భంగా గ్రామంలోని 25 మంది నిరుపేద మహిళలు, వృద్ధులకు చీరలు అందజేసినట్లు వివరించారు. సురేష్ పాల్గొన్నారు.

రెవెన్యూ శాఖలోకి తీసుకోవాలి

జగిత్యాల వాణిజ్యం: గతంలో రెవెన్యూశాఖలో పనిచేసి ఇతర శాఖల్లోకి సర్దుబాటు చేసిన వీఆర్‌వోలను తిరిగి తీసుకోవాలని పూర్వ వీఆర్‌వోల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ కోరారు. రెవెన్యూ శాఖలోని మిగిలిన ఖాళీలను వీఆర్ఏలతో భర్తీ చేయాలని కోరారు. పలువురు సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

కొడిమ్యాల: నాచుపల్లి గ్రామానికి చెందిన జలిగపు శ్రీలత(30) ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన శ్రీలతకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉండగా భర్త శంకర్ ఆరేళ్ల కిందట మృతిచెందాడు. శ్రీలత స్థానిక జేఎన్టీయూ కళాశాలలో స్వీపర్‌గా పనిచేస్తూ పిల్లలను పోషించుకుంటోంది. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ పోషణ భారంగా మారడంతో మనస్థాపానికి గురై బుధవారం అర్ధరాత్రి సమయంలో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతురాలి తల్లి సంగెపు పోచవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



శ్రీలత

ద్విచక్ర వాహనం చెట్టుకు ఢీకొని యువకుడి దుర్మరణం

కోరుట్ల : కోరుట్ల మండలం కిషన్‌రావుపల్లె గ్రామశివారులో ద్విచక్ర వాహనం చెట్టుకు ఢీకొని యువకుడు దుర్మరణం చెందిన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు కథనం ప్రకారం.. పట్టణంలోని ఝాన్సిరోడ్డుకు చెందిన కడకుంట్ల సుభాష్-భారతిల కుమారుడు సాయిరాం(27) ముంబయిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. దసరా పండగ సందర్భంగా కోరుట్లకు వచ్చాడు. గురువారం మధ్యాహ్నం అయిలాపూర్ వెళ్లగా రాత్రి ఇంటికి వస్తుండగా కిషన్‌రావుపల్లె శివారులో ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనున్న చెట్టును వేగంగా ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో అంబులెన్స్‌లో స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద స్థలాన్ని పరిశీలించి మృతుడి వివరాలు సేకరించినట్లు పేర్కొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల 15వ వార్డు శివాజీనగర్‌లో ఓ ఇంట్లో చోరీ జరిగింది. తోట ప్రసాద్ అనే వ్యక్తి ఇంటికి తాళం వేసి కరీంనగర్‌కు వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి ఇంట్లోని సుమారు రూ.5 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ.30 వేల నగదు చోరీకి పాల్పడ్డారు. పట్టణ పోలీసులు గురువారం సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ జరుపుతున్నారు.



మెట్‌పల్లిలో దుర్గాదేవికి 108 రకాల ప్రసాదాలు



కోరుట్ల: శ్రీదుర్గా దేవాలయంలో..



మల్లాపూర్‌లో బోనాలతో మహిళలు

ఘనంగా దేవీశరన్నవరాత్రులు



దేవీశరన్నవరాత్రుల సందర్భంగా దుర్గామాత మంటపాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. గురువారం సామూహిక కుంకుమార్చనలు, అన్నదానాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు.
- న్యూస్‌టుడే యంత్రాంగం

శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారి అలంకరణ



మెట్‌పల్లిలో..



మెట్‌పల్లిలో..



మెట్‌పల్లిలో వాసవిమాత



రాయికల్‌లో..



మల్యాలలో అమ్మవారికి కూరగాయలతో అలంకరణ

విగ్రహ ప్రతిష్ఠాపన

సారంగాపూర్, న్యూస్‌టుడే: మండలంలోని ధర్మనాయక్ తండాలో లంబాడీల మేరమయాడి(దుర్గమ్మ) విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలను గురువారం ప్రారంభించారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో మేరమయాడి, సంత్‌సేవాలాల్ విగ్రహ ప్రతిష్ఠాపన ప్రారంభ వేడుకలను లంబాడీ పూజారులు నిర్వహించారు. శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపన, అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు బంజారా యువజన సంఘ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

ఏర్పాట్ల పరిశీలన

ధర్మపురి: స్థానిక గోదావరి తీరంలో గురువారం సాయంత్రం సద్దుల బతుకమ్మ ఏర్పాట్లను సీఐ రాం నర్సింహారెడ్డి, పురపాలక కమిషనర్ గంగాధర్ కలిసి పరిశీలించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: మండలకేంద్రంలోని రైతు వేదికలో లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి చెక్కులను కోరుట్ల ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్ గురువారం పంపిణీ చేశారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 77 మంది లబ్ధిదారులకు రూ.77.08 లక్షల విలువ గల చెక్కులను అందజేశారు. తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో చంద్రశేఖర్, దశరథ్‌రెడ్డి, చిన్నారెడ్డి, శేఖర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మల్లాపూర్ మండలానికి మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను గురువారం ఎమ్మెల్యే సంజయ్ పంపిణీ చేశారు. 70 మందికి రూ.70.03 లక్షల చెక్కులను అందజేశారు. అనంతరం దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. తహసీల్దార్ వీర్‌సింగ్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మల్లాపూర్‌లో ఎమ్మెల్యేకు సన్మానం

పండగలకు ప్రత్యేక ఏర్పాట్లు

మెట్‌పల్లి పట్టణం, న్యూస్‌టుడే: దసరా, బతుకమ్మ పండగల సందర్భంగా ప్రజలకు అసౌకర్యం కాకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు బల్దియా కమిషనర్ మోహన్ తెలిపారు. గురువారం పట్టణంలోని పెద్దచెరువుతో పాటు దసరా జంబి కోసం వ్యవసాయ మార్కెట్ ఆవరణను శుభ్రం చేయించి, బతుకమ్మ ఘాట్‌లో నీటిని నింపి సిద్ధం చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ముజీబ్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.



చెరువు వద్ద శుభ్రం చేయిస్తున్న కమిషనర్ మోహన్

సింహ వాహనంపై నారసింహుడి ఊరేగింపు

ధర్మపురి : పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి సింహ వాహనంపై స్వామివారిని వీధుల్లో ఊరేగించారు. దేవస్థానం సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంటు శ్రీనివాస్, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.



పురవీధుల్లో నారసింహుడి సేవ

ఘర్షణలకు పాల్పడితే చర్యలు

బుగ్గారం: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలుంటాయని సీఐ రాంనర్సింహరెడ్డి హెచ్చరించారు. గురువారం గోపులాపూర్‌లో శాంతి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. దసరా సందర్భంగా గొడవలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. ఎస్సై శ్రీధర్‌రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.